# ప్రజాశక్తి

మంగళవారం 07 నవంబర్ 2023

5

కర్నూలు

కలెక్టరేట్ ఎదుట నిరసన నుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి పిఎస్. రాధాకృష్ణ

# సలీమ్ శంకర్ బాటలో..

## మత్స్యశాఖ విశ్రాంత ఉద్యోగి...

**- సర్వే 643,545 లో 20 ఎకరాలకు పైగా భూఅక్రమణ - నాలుగుచోట్ల గుంతలు త్రవ్వి ఎర్రమట్టి అక్రమరవాణా**
**- గుంతలలోకి ఎల్ఎల్సి నీటిని అక్రమంగా తరలించి సాగు**

**ప్రజాశక్తి-సి బెళగల్**

సి బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి రెవిన్యూ శివారులో సలీమ్ శంకర్ చేతిలో అన్యాక్రాంతమైన భూములు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఇక్కడే మరో వ్యక్తి మత్సశాఖలో పదవి విరమణ పొంది సలీమ్ శంకర్ బాటలోనే భూఅక్రమణ చేస్తున్నట్లు దర్శనమిస్తున్నాయి. సర్వే 643, 545 లలో సుమారు 20 నుండి 25 ఎకరాలు ఆక్రమించి ఎగుమతి సాగులు చేస్తూ సొమ్ములు చేసుకుంటున్నట్లు తెలిసింది. అడిగేవారు లేరని ఏటా ఎర్రమట్టిని వివిధ కంపెనీలకు అమ్ముకొని జేబులు నింపుకోవడమే కాకుండా పెద్ద గుంతలను ఏర్పాటు చేసుకొని అక్కడికి వెళ్తున్న ఎల్లెల్సి కాలువకు గండికొట్టి నీటిని యాతేత్సగా గుంతలు నింపుకుని సాగుకు, చేపల పెంపకానికి వినియోగిస్తున్నారు. ఆయన పలుకుబడికి విద్యుత్ అధికారులు కూడా విద్యుత్ సరఫరా చేశారు. ఆయనకు అండదండలు నిండుగా ఉన్నాయని ఆయన చేతిలో అన్యాక్రాంతమైన భూమిని దాటి రైతులు మహీంద్రా, లింగన్నలు వెళ్లే పొలాలకు దారివ్వకుండా దౌర్జన్యం చేస్తున్నట్లు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు భూ అక్రమణలపై దృష్టి సారించి ప్రభుత్వ అధీనంలోకి తీసుకుని పేదలకు పంపిణీ చేయాలని స్థానికులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. భూ అక్రమార్కులపై కఠిన చర్యలు చేపట్టి అన్యాక్రాంతమైన భూములను కాపాడాలని పలువురు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

**దౌర్జన్యకారుడికే యంత్రాంగం వత్తాసు**

**- మహేంద్ర, రైతు, గూడూరు**

మా పొలానికి దారి ఉన్నా వెళ్లానివ్వకుండా బారికి శ్రీనివాసులు దౌర్జన్యం చేస్తున్నాడు. ఎనిమిదేళ్లుగా యంత్రాంగం చుట్టూ ప్రదీక్షణలు చేసిన పాపానికి దౌర్జన్యకారుడికే వత్తాసు పలుకుతున్నారు. పొలం కాజేయాలని చూస్తున్న అతడికే అమ్మాలనడం సిగ్గు చేటు.

**భూ ఆక్రమణదారులకే యంత్రాంగం కొమ్ము**

**- కెవి.నారాయణ, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి**

సలీమ్ శంకర్, బారికి శ్రీనివాసులు ఒకప్పుడు ఉద్యోగులని ప్రస్తుతం అండదండలు నిండుగా ఉన్నాయని భూఆక్రమణలు పాల్పడుతున్న వారికే యంత్రాంగం కొమ్ము కాస్తుండటం నిస్సిగ్గుగా ఉంది. బ్రాహ్మణ దొడ్డి రెవిన్యూ శివారులో వేల ఎకరాలున్నట్లు సిపిఎం గుర్తించి 8 ఏళ్ల కిందటే సర్వేలు చేయించింది. అప్పుడే అక్రమాలు వెలుగుచూసాయి అయినా స్పందన లేదు. అదే భూములలో ప్రవహిస్తున్న ఎల్లెల్సి కాలువకు గండికొట్టి సుమారు 15 చోట్ల కుంటలను ఏర్పాట్లు చేసుకొని అక్రమంగా నీటిని వాడుకోవడం, చేపల పెంపకం వంటివి చేస్తున్నారు. వందల ఎకరాలలో గుంతలు తవ్వి మట్టిని అమ్ముకోవడం కోట్లలో జేబులు నింపుకోవడం వారి దగ్గరి నుండి యంత్రాంగంలోని అధికారులు ముడుపులు తీసుకుంటున్నారు. ఉద్యమాలు ఆపేదిలేదు. ఇప్పటికైనా భూమిలేని నిరుపేదలకు, సాగులు చేసుకొంటున్న కూలీలకు పంచాలి.

# విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలి

**- సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎమ్.డి.అంజిబాబు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రయివేటీకరించరాదని చేపడుతున్న పోరాటం 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. న్యూ సిటీ కార్యదర్శి సాయి బాబా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, అంజిబాబు, సిఐటియు సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేటీకరించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. చత్తీస్‌గడ్‌లో ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం అక్కడ ఎన్నికలను, ప్రజా పోరాటాలను దృష్టిలో పెట్టుకొని ఉపసంహరించుకుందని తెలిపారు. తమిళనాడులో ప్రయివేటీకరిస్తానని చెప్పిన ఉక్కు ఫ్యాక్టరీని అక్కడి డిఎంకె రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు వెన్నుదన్నుగా నిలవడంతో దాన్ని వెనక్కి తీసుకుందని చెప్పారు. రాష్ట్రంలో 1000 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్రం మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. దీనికి కారణం రాష్ట్రంలో అధికారంలో ఉండే వైసిపి.. కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించడమేనని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కార్మికులకు మద్దతుగా నిలబడి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉంటే విశాఖ ఉక్కును ప్రయివేటుకరించాలనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకునేదని చెప్పారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ జరుగుతుందంటే దానికి కారణం అధికారంలో ఉండే వైసిపి.., ఏమాత్రం పోరాటాలు చేయలేని ప్రతిపక్ష టిడిపిలేనని మండిపడ్డారు. 32 మంది విద్యార్థులు, అనేకమంది ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పదవులు త్యాగం చేసిన విశాఖ ఉక్కు ప్రయివేటీకరణతో వైసిపి, టిడిపిలు కార్మికులకు తీరని ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా బిజెపితో తెగతెంపులు చేసుకోవాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వెయ్యి రోజులే కాదని, ఇంకా రెండు వేల రోజులైనా పోరాడతామని హెచ్చరించారు. సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, అధ్యక్షులు అబ్దుల్ దేశాయి, నగర నాయకులు రాంబాబు, మహ్మద్, రామకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

# బాణసంచా స్టాళ్ల ఏర్పాటుకు నిబంధనలు పాటించాలి

**- కలెక్టర్ డాక్టర్ జి.సృజన**

**ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్**

దీపావళి పండుగను సురక్షితమైన వాతావరణంలో జరుపుకునేందుకు బాణసంచా స్టాళ్లు ఏర్పాటు చేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఎక్స్ ప్లోసివ్ యాక్ట్ ప్రకారం లైసెన్స్ లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సిజన అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎస్పితో పాటు ఇతర ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాణసంచా స్టాళ్లు ఏర్పాటు చేయుటకు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి పై ఏమైనా నేర చరిత్ర ఉందా లేదా అని వెరిఫై చేసి లైసెన్స్ ఇవ్వాలని సంబంధిత డివిజనల్ అధికారులను ఆదేశించారు. చిన్న పిల్లలకు బాణసంచా విక్రయించకుండా చూసుకోవాలన్నారు. ఐఎస్ఐ స్టాండర్డ్‌తో ఉన్న బాణాసంచా మాత్రమే అమ్మే విధంగా చూసుకోవాలని ఆదేశించారు. స్టాల్స్ వద్ద అగ్నిమాపక వాహనాన్ని, అంబులెన్స్ వాహనాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పి జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ బాణసంచా దుకాణాల కొరకు దరఖాస్తు చేసుకునే వారిపై క్రిమినల్ కేసులు ఏమైనా ఉన్నాయా లేదా అని పరిశీలిస్తామని కలెక్టర్‌కు తెలిపారు. అదే విధంగా అమ్మకాలు జరిపే చోట రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా పని చేస్తూ ఎల్ ఆకారంలో స్టాల్ ఏర్పాటు చేయించాలన్నారు. పిల్లలను అమ్మకాల ప్రదేశాలకు తీసుకొని రాకూడదని సూచించారు. బాణసంచా దుకాణాలకు, వెహికల్స్ పార్కింగ్ కు కనీస దూరం ఉండేలా చూసుకోవాలన్నారు.

**స్పందనలో వినతులను స్వీకరించిన జెసి**

కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో బాధితుల నుండి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడంతో పాటు స్పష్టంగా ఎండార్స్‌మెంట్ అందచేయాలని సూచించారు. నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జెసితో పాటు డిఆర్ఒ మధు సూదన్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అర్జీలను స్వీకరించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

# 'న్యూస్ క్లిక్'పై నిర్బంధం తగదు

**- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు - కలెక్టరేట్ ఎదుట కార్మిక ప్రజా సంఘాల నిరసన**

**ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్**

'న్యూస్ క్లిక్' మీడియాపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్బంధం తగదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప తెలిపారు. న్యూస్ క్లిక్ యజమాని ప్రభిర్ పురకాయస్త, అడ్మినిస్ట్రేట్ మేనేజర్ అభిజిత్ చక్రవర్తిని అరెస్టు చేయడాన్ని ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మీడియాపై నరేంద్ర మోడీ ప్రభుత్వం జరుపుతున్న దాడులకు నిరసనగా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు, మునెప్ప, రైతుసంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఎస్‌యుసిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగన్న పాల్గొని మాట్లాడారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత మీడియా రంగంపై ఆంక్షలు పెరిగిపోయాయని విమర్శించారు. న్యూస్ క్లిక్ ప్రతినిధులు, 16 మంది పాత్రికేయులపై ఉపా చట్టం కింద కేసులు బనాయించారని, ఇది తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. దేశంలో మీడియా స్వేచ్ఛ మరింత దిగజారిందని తెలిపారు. 180 దేశాల్లో భారతదేశం మీడియా స్వేచ్ఛలో 161 స్థానంలో ఉందని చెప్పారు. గతేడాది జరిగిన రైతు ఉద్యమాన్ని ప్రపంచానికి తెలియజేయడమే న్యూస్ క్లిక్ చేసిన నేరమని తెలిపారు. న్యూస్ క్లిక్‌కు విదేశాల నుంచి ఆర్థికంగా సహాయమందుతుందనే పేరుతో వారిని అరెస్టు చేశారని చెప్పారు. ఎవరి ద్వారా అయితే డబ్బులు అందాయని వారు ఆరోపిస్తున్నారో, నెల్లివెల్లి రాయి సింగం అనే అమెరిక వామపక్షవాది 'నేను న్యూస్ క్లిక్‌కు ఎలాంటి ఆర్థిక సహాయమూ అందించలేద'ని తెలిపారని అన్నారు. 1975-77 మధ్య విధించిన ఎమర్జెన్సీ కంటే భయంకరమైన పరిస్థితులు ప్రస్తుం ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైతే ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపుతారో వారిని అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేసి శిక్ష విధించే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. స్టాన్ స్వామిని ఆ రకంగానే జైలులో ఉంచి మరణానికి కారణమైందని తెలిపారు. వరవరరావు, సాయిబాబు లాంటి వారిని ఇప్పటికీ హింసిస్తున్నారని చెప్పారు. ఒకవైపు ప్రజలపై భారాలు వేస్తూ, భారాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వారిపై కక్ష సాధింపు చర్యలు పూనుకోవడం సరైనది కాదని తెలిపారు. ఇలాంటి విధానాలు మానుకోవాలని హితవు పలికారు. రాబోవు కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కక్ష సాధింపుల విధానాలకు వ్యతిరేకంగా జరిగే ప్రజా ఉద్యమాల్లో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, సిఐటియు సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు, సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి సాయిబాబా, అబ్దుల్ దేశాయి, మహ్మద్, రామకృష్ణ, సివిల్ సప్లయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ, సిఐటియు నాయకులు రాంబాబు, ఎఐటియుసి నగర అధ్యక్షులు రామాంజనేయులు, ఆటో యూనియన్ నాయకులు ఈశ్వర్, కృష్ణారెడ్డి, రాము, ఈశ్వర్ రెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లన్న, ఇరిమియా, అమీనాబీ, రైతుసంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు

కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న కేంద్ర కార్మిక సంఘాలు

ఆటోకు పోస్టరును అతికించి ప్రచారం ప్రారంభిస్తున్న అంజిబాబు, రాధాకృష్ణ

## 15 న 'చలో విజయవాడ 'ను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

అసమానతలు లేని రాష్ట్ర అభివద్ధి కోసం ఈనెల15న విజయవాడలో జరుగుతున్న భారీ ర్యాలీ బహిరంగ సభలో ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి అంజిబాబు ఆటో కార్మికులను కోరారు. బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరుతూ ఆటోలకు పోస్టర్లు అతికించి ప్రచారాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అసమానతలు లేని రాష్ట్ర అభివృద్ధి కోసం గతనెల 30 నుండి మూడు ప్రాంతాల నుంచి బయలు దేరిన బస్సు యాత్రలు 15న విజయవాడ చేరుకుంటున్న సందర్భంగా భారీ ర్యాలీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా విస్మరించిందని తెలిపారు. ఇప్పటివరకు ప్రత్యేక హోదా, ప్రాజెక్టులను పూర్తి చేయడం, ప్రజలకు కావలసిన సౌకర్యాలు కల్పించడంలో, నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు, రైతులకు గిట్టుబాటు ధరలు, కరువు చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. ఈనెల 15 విజయవాడలో ర్యాలీ, బహిరంగ సభకు వేలాదిగా ఆటో కార్మికులు తరలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి రఫీ పాల్గొన్నారు.

## పోలీస్ స్పందనకు 89 ఫిర్యాదులు

**ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ :** జిల్లా పోలీస్ శాఖ సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 89 ఫిర్యాదులు వచ్చాయి. కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పి క్యాంపు కార్యాలయంలో ఎస్పి జి.కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పి అడ్మిన్ టి.సర్కార్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 89 ఫిర్యాదులు వచ్చాయి. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు అడిషనల్ ఎస్పి అడ్మిన్ టి.సర్కార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సిఐలు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న పోలీసు అధికారులు

# బడుగుల అభివృద్ధికి జగనన్న బాటలు : ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ , వైసిపి నాయకులు

**ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ :** ప్రజాసంకల్ప యాత్ర ఆరేళ్ల పూర్తయిన సందర్భంగా వైసిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. కర్నూలు, కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాల పరిధిలో కార్యక్రమాలు నిర్వహించారు. కేక్‌లు కట్‌చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలు వేశారు.

పాదయాత్రతో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి బడుగుల అభివృద్ధికి బాటలు వేశారని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హాఫీజ్ ఖాన్ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన పాదయాత్రకు నేటికీ ఆరు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఎమ్మెల్యే హాఫిజ్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. అందులో భాగంగా నగరంలోని ఎస్‌బిఐ సర్కిల్ లోని వైఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి గజమాలలు, పూలమాలలతో ఘన నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల సమస్యలను తెలుసుకోవటానికి ఆనాడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర చేపట్టారన్నారు. తన మానిఫెస్టోలో సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా రాష్ట్రంలో కొనసాగిస్తున్నారన్నారు. గోశాల చైర్మన్ ఆది మోహన్ రెడ్డి, వైఎస్ఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కేదార్నాథ్, స్టాండింగ్ కమిటీ సభ్యులు నగరూరు శ్రీనివాసరావు, కో ఆప్షన్ మెంబర్స్ నయీమ్ పాషా, చాట్ల నవీన్, కార్పొరేటర్లు రాజరాజేశ్వర్ రెడ్డి, విజయలక్ష్మి, షేక్ అహ్మద్, షాషావలి, నాయకులు, వార్డ్ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ప్రజాసంకల్ప యాత్రకు ఆరేళ్లు: ఎమ్మెల్యే సుధాకర్**

వైసిపి అధినేత వైఎస్. జగన్మోహన్ రెడ్డి తలపెట్టిన 'ప్రజాసంకల్ప యాత్ర' ఆరేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ కర్నూలు నగరంలోని స్టాంటన్ పురంలో కోడుమూరు నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ, జెడ్పిటిసి ప్రసన్నకుమార్, వైస్ ఎంపిపి నెహెమ్మా, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ మహబూబ్‌బాషా మండల కన్వీనర్లు, జెసిఎస్ కోఆర్డినేటర్లు, ఎంపిటిసిలు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు వైసిపి కార్యాలయంలో కేట్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్, ఇతర వైసిపి నాయకులు

# డప్పు కళాకారుల సమస్యలను పరిష్కరించాలి

**సచివాలయాల ముందు ధర్నా**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

డప్పు కళాకారులకు ఇస్తున్న ప్రభుత్వ గుర్తింపు కార్డులకు సంబందించిన పంపిణీని పాత పద్ధతిలోనే జిల్లా కేంద్రాల నుండే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ డప్పుకళాకారుల సంఘం ఆధ్వర్యంలో కర్నూలు బుధవార పేటలో 36,37 సచివాలయాల ముందు ధర్నా నిర్వహించి సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రం ఇచ్చారు. డప్పు కళాకారుల సంఘం బుధవారపేట వార్డు నాయకులు దస్తగిరి అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి ఎండి. ఆనంద్‌బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌జి.కృష్ణ, డి.విజయమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.భాస్కర్, జిల్లా నాయకులు మారెప్ప మాట్లాడారు. సమస్త కళలకు గుర్తింపునిచ్చిన పాలకులు దళితుల వృత్తిగా ఉన్న డప్పుకు మాత్రం గుర్తింపును ఇవ్వలేదన్నారు. ఎపి డప్పు కళాకారుల సంఘం నిర్వహించిన పోరాట ఫలితంగా ఉమ్మడి రాష్ట్రంలో డప్పుకు 2013లో గుర్తింపు ఇచ్చారన్నారు. రాష్ట్రం విడిపోయాక విజయవాడ నుండి ఇస్తూ వస్తున్న ప్రభుత్వ గుర్తింపు కార్డులు, మరో పోరాటం ద్వారా జిల్లా కేంద్రాల నుండే ఇచ్చే విధంగా సాధించుకున్నామన్నారు. ఈ మధ్యకాలంలోనే రాష్ట్ర సిసిఎల్ఎ ఇచ్చిన ప్రకటన ద్వారా గుర్తింపు కార్డుల పంపిణీ కోసం కేటాయించాల్సిన నిధులను టూరిజం శాఖకు కేటాయిస్తూ, విజయవాడ నుండి గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. దీని ద్వారా నిరక్షరాస్యులైన దళిత డప్పు కళాకారులు గందరగోళానికి గురై అనేక అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. జిల్లా కేంద్రాల నుండే గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ వయస్సును 45 సంవత్సరాలకు తగ్గించి, ప్రభుత్వ గుర్తింపు కార్డు ఆధారంగానే పెన్షన్‌కు నమోదు చేసుకోవాలన్నారు. పెన్షన్ 5000కు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమ, మంగళ వారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాల ముందు ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కర్నూలు నగరంలోని జోహరాపురం, కర్నూలు మండలం పసుపల, కల్లూరు మండలం పెద్దపాడు, తడకనపల్లె, ఏ గోకులపాడు, చిన్నటేకూరు, పెద్దటేకూరు, పర్ల, గోనెగండ్ల మండల కేంద్రంతో పాటు ఐరన్ బండ, ఎర్రబాడు, మంత్రాలయం మండల కేంద్రంతో పాటు సూగూరు, కౌతాళం మండల కేంద్రాలలో సచివాలయాల ముందు డప్పు కళాకారులు ఆందోళన నిర్వహించారు.



సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న ఎండి.ఆనంద్‌బాబు

నిరసన తెలుపుతున్న మదనగోపాల్, తదితరులు

## టిడిపితోనే రాష్ట్రానికి భవిష్యత్తు : గౌరు చరిత

**ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ :** టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు అని ఆ పార్టీ పాణ్యం ఇంచార్జీ మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో బాబు ష్యూరిటి- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా గ్రామంలో మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పర్యటించి సమస్యలు తెలుసుకుంటూ రచ్చ బండ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి గెలిస్తే అమలు చేయబోయే పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పిం చారు. మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు, మాజీ ఎంపిపి వాకటి మా ధవి, పెద్దటేకూరు గ్రామ నాయకులు కె.వెంకటప్ప, సాయి తరుణ్ రెడ్డి, యా గంటయ్య, రఘురాం, కురువసురేష్, ఐటిటిపి రామక్రిష్ణ, మండల నాయ కులు పెద్దపాడు తిరుమలేష్ రెడ్డి, పెద్ద బీచుపల్లి, చిన్న బీచుపల్లి, ఉలింద కొండ ఇవి రమణ, మాదేష్, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు గంగాధర్ గౌడ్, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేశ్ గౌడ్ పాల్గొన్నారు.

## కర్నూలును కరువు మండలంగా ప్రకటించాలి

**జెసికి సిపిఎం వినతి**

**ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్:** కర్నూలును కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారా యణ మండల కార్యదర్శి పిబి.ఉషే నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో మండల నాయకులు రాఘవేంద్ర, ఆంజనేయులు, బీసన్నలతో కలిసి జెసికి వినతి పత్రం అందజేశారు. జెసితో వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో అతిపెద్ద మండలాలుగా ఉన్న మండలాలలో కర్నూలు మండలం ఒకటని. పదివేల జనాభా కలిగిన ఐదు గ్రామాలు మండలంలో ఉన్నాయని, 30 గ్రామాలతో కూడిన అతిపెద్ద మండలం అని అన్నారు. మండలంలో 27 వేల ఎకరాల్లో రైతులు సాగు చేసుకున్నారని అన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్లో వర్షాలు కురుస్తాయని, కొన్ని గ్రామాలకు కెసి కెనాల్, తుంగభద్ర నది ద్వారా సాగునీళ్లు వస్తాయని రైతులు పంటలు బాగా వేసుకున్నారని అన్నారు. కానీ వర్షాలు కురవక, సాగునీరు రాక పంటలు వేసి నష్టపోయారన్నారు. జెసి అగ్రికల్చర్ జెడిని పిలిచి కర్నూలు మండలంలో పంట నష్టపరిహారాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలన్నారు. వచ్చిన నివేదిక ఆధారంగా నిర్ణయిస్తామని హామీ ఇచ్చారు.



జెసికి వినతిపత్రం ఇస్తున్న నారాయణ, తదితరులు

## స్కూళ్లలో డ్రాపౌవుట్‌ను తగ్గించాలి

**- టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ**

**ప్రజాశక్తి - ఆదోని**

సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మాట్లాడుతున్న

స్కూళ్లలో డ్రాపౌట్లను తగ్గించేందుకు 6 నుంచి 10 వరకు చదువుకునే వలస విద్యార్థులకు సీజనల్ హాస్టల్ వసతి కల్పించాలని టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలోని రూరల్ మండలాల విద్యార్థులకు సీజనల్ హాస్టళ్లు ఎక్కడా అని ప్రశ్నించారు. ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో అనేక మండలాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు చేతికందక, పెట్టుబడి తిరిగి రాక రైతులు సంక్షోభంలో కూరుకు పోయారని తెలిపారు. గ్రామాల్లో పనుల్లేక పిల్లలను తీసుకొని వలస వెళ్తున్న పరిస్థితి ఉందన్నారు. పంటలన్నీ ఎండిపోవడంతో రైతులు, కూలీలు జీవనోపాధి కోసం, చేసిన అప్పులు తీర్చడం కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. 1-5 వరకు తరగతి చదువుకునే పిల్లలు 60-70 శాతం వలసలు వల్ల చదువుకు దూరమవుతున్నారని చెప్పారు. వెల్ఫేర్ హాస్టల్స్ ఉన్నా వాటి వల్ల కొంతమంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారని తెలిపారు. సీజనల్ హాస్టల్‌లో ఉంచే విద్యార్థులకు చదువుతో పాటు ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నేర్పిస్తే బాగుంటుందని డిమాండ్ చేశారు. టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, గోపాల్, మాజీ ఎంపిటిసి రాజేశ్వరి, తెలుగు యువత ఉపాధ్యక్షులు జి.రామకృష్ణ, ఆదోని ముస్లిం, మైనార్టీ నాయకులు సాధిక్ సయ్యద్, వాసిమ్ ఖాద్రీ, వలీ, రాఘవేంద్ర రెడ్డి, ఈరన్న, వీరేష్ పాల్గొన్నారు.

## చెకుముకి టెస్టు గోడపత్రిక విడుదల

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

గోనెగండ్లలో ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ పాఠశాల, ఎపి మోడల్ స్కూళ్లలో జన విజ్ఞాన వేదిక చెకుముకి గోడ పత్రికను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జెవివి సైన్స్ కోఆర్డినేటర్ కె.విజయకుమార్, గుమ్మాల బాబు మాట్లాడారు. విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన పెంచడం, సైన్స్‌పై అభిరుచిని పెంచడం, రాబోయే కాలంలో శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవడం కోసం జన విజ్ఞాన వేదిక ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోనెగండ్ల జడ్‌పిహెచ్‌ఎస్ ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఎపి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు పద్మావతి, కస్తూర్బా గాంధీ పాఠశాల రాధా, మణి పాల్గొన్నారు.

## టిడిపి నాయకుల మాటలు నమ్మవద్దు

**- మున్సిపల్ ఛైర్మన్ శాంత**

**ప్రజాశక్తి - ఆదోని**

నివాళులర్పిస్తున్న ఛైర్మన్ శాంత, జయ మనోజ్ రెడ్డి

అధికార దాహం కోసం ముఖ్యమంత్రి జగన్‌పై టిడిపి నాయకులు చేస్తున్న ఆరోపణలను నమ్మవద్దని మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి నాయకులు జయమనోజ్ రెడ్డి తెలిపారు. సోమవారం 28వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ప్రతి గడపకూ తిరుగుతూ వార్డుల సమస్యలు తెలుసుకుంటూ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజాసంకల్ప పాదయాత్ర ఆరో సంవత్సరం పూర్తయిన సందర్భంగా వైఎస్.రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలు అందరికి పంచి పెట్టారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, సింహం నాగేంద్ర, నాయకులు రహీం, అశోక్, భాస్కర్, దుర్గప్ప, రామకృష్ణ, బాలాజీ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, రాజేశ్వర్ రెడ్డి, రాందాస్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, సన్నీ, శ్రీనివాస్ రెడ్డి, మజార్, ఎంఎంజి.గౌస్, లక్ష్మన్న, బ్రహ్మ, చిరు ఉన్నారు.

**భాషా, సాంస్కృతిక శాఖ నుంచే...**

## గుర్తింపు కార్డులు జారీ చేయాలి : డికెఎస్

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

గ్రామీణ డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులను జిల్లా కేంద్రంలోని శాఖ నుంచే జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కరుణాకర్ డిమాండ్ చేశారు. సోమవారం కరుణాకర్, ఎపిడికెఎస్ మండల అధ్యక్షులు మారేష్ ఆధ్వర్యంలో గోనెగండ్ల 1, 2, 3, 4వ గ్రామ సచివాలయాల దగ్గర, ఎర్రబాడు, ఐరన్ బండ-ఎ గ్రామాల్లోని గ్రామ సచివాలయాల దగ్గర డప్పు దరువులతో ఆందోళన చేపట్టి, పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డప్పు కళాకారులకు నిధులు, గుర్తింపు కార్డులను పాత పద్ధతిలోనే జిల్లా కేంద్రంలోని భాషా సాంస్కృతిక శాఖ ద్వారానే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి పెద్ద కర్రెన్న, మండల మాజీ కార్యదర్శి దేవదాస్, డప్పు కళాకారులు నరసింహుడు, నాగరాజు, రత్నమయ్య, కిష్టన్న, చిన్న దేవన్న, రంగస్వామి, మునెప్ప, బజారి, మారెప్ప, మాణిక్యం, చిన్న కొండయ్య పాల్గొన్నారు.

# అడుగంటిన ఖాజీపురం జలాశయం

**- ఆరు గ్రామాలకు తాగునీటి గండం**

**- గ్రహించలేకపోతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు**

**- ఈ నెలాఖరు నాటికి తుంగభద్ర జలాశయం నుంచి అధికారికంగా నీరు బంద్**

**ప్రజాశక్తి - చిప్పగిరి**

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు పెడుతున్నప్పటికీ చాలా మండలాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. జిల్లా పశ్చిమ ప్రాంతం చిప్పగిరి మండలం.. అందులోనూ చాలా గ్రామాలు తాగునీటి సమస్యతో అల్లాడిపోతున్నాయి. మండలంలో ప్రధానంగా 16 గ్రామాలు ఉన్నాయి. అందులో చిప్పగిరి, దౌల్తాపురం, కుందనగుర్తి, బంటనహాల్, గుమ్మనూరు, ఖాజీపురం గ్రామాలకు ఖాజీపురం జలాశయం నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇప్పటివరకు కూడా ఖాజీపురం జలాశయానికి తాగునీటిని నింపలేదని మండల ప్రజలు, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు గగ్గోలు పెడుతున్నారు. రానున్న వేసవిలో ప్రజలు తమపై దండయాత్ర చేసే పరిస్థితి ఉందని పలువురు ప్రజాప్రతినిధులు భయపడుతున్నారు. ఖాజీపురం జలాశయానికి తుంగభద్ర జలాశయం నుంచి హెచ్ఎల్‌సి కాలువ ద్వారా నీటిని నింపాల్సి ఉంది. కాలువకు ఎగువన



అడుగంటి పోతున్న ఖాజీపురం జలాశయం

ఉన్న రైతులు అక్రమంగా మోటార్లు బిగించి పంటలకు నీరు పడుతూ... జలచౌర్యానికి పాల్పడుతున్నారు. ఖాజీపురం జలాశయానికి నీరు చేరడం లేదని అధికారులు కుంటి సాకులు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను గుర్తించి ఖాజీపురం జలాశయానికి నీటిని నింపితే ప్రజల దాహార్తిని తీర్చిన వారవుతారు. లేకపోతే ఇదే అలసత్వం వహిస్తే రానున్న వేసవిలో తాగునీటి సమస్య ఎంత తీవ్రంగా ఉంటుందో అర్థమవుతుందని ప్రజలు తెలుపుతున్నారు. ఈనెల చివరి నాటికి తుంగభద్ర జలాశయం బోర్డు అధికారులు అధికారికంగా నీటిని నిలిపివేస్తామని ప్రకటించారు. ఖాజీపురం జలాశయానికి నీటిని నింపాలని గత వారం క్రితం సర్పంచులు ఉన్నతాధికారులకు వినతిపత్రం కూడా అందజేశారు. దీనికి ప్రత్యామ్నాయ చర్యలు కూడా లేవని ప్రజలు పేర్కొంటున్నారు. వెంటనే నీటిని నింపాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు.

## హంద్రీనీవా నుంచి సాగునీరివ్వాలి

**- 8,9న 30 గంటల నిరవధిక దీక్ష**

**- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్**

**ప్రజాశక్తి- దేవనకొండ**

హంద్రీనీవాకు గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ వరకు సాగునీరివ్వాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ కోరారు. గుండ్లకొండ దగ్గర హంద్రీనీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ, మాచాపురం గ్రామాల వరకు సాగునీరు ఇవ్వాలని, మండలంలోని చెరువులన్నింటికీ హంద్రీనీవా ద్వారా నీరు మళ్లించాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేవనకొండలో ఈనెల 8, 9న 30 గంటల నిరవధిక దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. సోమవారం స్థానిక అయ్యప్ప స్వామి గుడి ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి, సిఐటియు మండల కార్యదర్శి అశోక్ మాట్లాడారు. నిత్యం కరువుతో అల్లాడుతున్న దేవనకొండ మండలాన్ని కరువు నుంచి శాశ్వతంగా విముక్తి చేసే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే హంద్రీనీవా ద్వారా కొన్ని గ్రామాలకు సాగు నీరు రైతులకు అందుతోందని చెప్పారు. మండలంలోని ఎగువ గ్రామాలైన గుండ్లకొండ, గుడిమిరాళ్ల, బంటుపల్లి, బేతపల్లి, చెల్లెల చెలిమిల, బండపల్లి, కోటకొండ, వెంకటాపురం, పల్లెదొడ్డి, బురకుంట, మాచాపురం గ్రామాలకు సాగునీటి కోసం గుండ్లకొండ దగ్గర ఏర్పాటు చేస్తే గ్రావిటీ కింద 20 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఏటా కరువుతో రైతులు ఇబ్బందులు గురవుతున్నారని, ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష, ఈరప్ప, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీరశేఖర్

## బిజెపికి కొమ్ము కాసే పార్టీలను వ్యతిరేకించాలి : సిపిఎం

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

రాష్ట్రంలో బిజెపికి కొమ్ము కాసే వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా నాయకులు గోవిందు, పట్టణ నాయకులు రాముడు కోరారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 15న చలో విజయవాడ ప్రజా రక్షణ భేరి యాత్రను జయప్రదం చేయాలని సుందరయ్య భవన్‌లో గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని ఓడించాలని ప్రజలను కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తున్న పార్టీలపై ప్రధానంగా సిపిఎంపై నిర్బంధ విధానాలను మానుకోవాలని హితవు పలికారు. ఈనెల 15న చలో విజయవాడలో ప్రజలందరూ జయప్రదం చేయాలని, మహా ప్రదర్శన, బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరారు. సిపిఎం కార్యకర్తలు అబ్దుల్లా, రమేష్, చంద్ర, రాజు, సురేష్ పాల్గొన్నారు.

# రానున్నది చంద్రన్న రాజ్యమే...

**- ప్రజా విశ్వాసం కోల్పోతున్న జగన్**

**- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు**

**ప్రజాశక్తి - ఆదోని**

రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగన్ ప్రజా విశ్వాసం కోల్పోయారని, వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయ ఢంకా మోగించి చంద్రన్న రాజ్యం రావడం తథ్యమని టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ధీమా వ్యక్తం చేశారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే పథకాలను వివరించారు. సోమవారం అలసందల గుత్తి, బసరకొడు గ్రామాల్లో, పట్టణంలోని ఖాని మొహల్లాలో టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చంద్రబాబును 52 రోజులు జైలులో పెట్టి కుట్రపూరిత రాజకీయం చేశారని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నారన్నారు. 45 రోజులపాటు 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి మేనిఫెస్టోను వివరించారు. మహిళలకు సంబంధించి మహాశక్తి, రైతులకు అన్నదాత, యువకులకు యువగళం, బీసీలకు రక్షణ చట్టం, ఇంటింటికి రక్షిత మంచి నీటి కార్యక్రమాలు అమలు

ఆదోనిలో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

చేస్తామన్నారు. నాయకులు రామస్వామి, జెబి.రంగన్న, జిల్లా కార్యదర్శి బుద్ధారెడ్డి, ఉరుకుంద రెడ్డి, వెంకటేష్, నారా, లక్ష్మీన్న, సోము, రవి, జయరాజు, వెంకటేశ్వర్ రెడ్డి, సాదుల్లా, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అల్తాఫ్, వీరేష్ ఉన్నారు.

**మంత్రాలయం :** వచ్చే 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపొందడం తథ్యమని టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని బూదూరు గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి అధ్యక్షతన ఇంటింటికి తిరిగి టిడిపి సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి చంద్రబాబును, నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ప్రమాదం జరిగి చికిత్స పొందిన టిడిపి నాయకులు సుధాకర్ రెడ్డిని పరామర్శించారు. టిడిపి నాయకులు బూదూరు మల్లికార్జున రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు ఎల్లా రెడ్డి, చావిడి వెంకటేష్, సూగూరు భాస్కర్ రెడ్డి, చిలకలడోన మాజీ సర్పంచి హనుమంతు, ఎస్సీ నాయకులు చిదానంద పాల్గొన్నారు.

**హాలహర్వి** మండలంలోని బల్లూరు, సిదాపురం, అమృతపురం, గూళ్యం గ్రామాల్లో టిడిపి ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. గ్రామాల్లోని ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచి పెట్టారు. నాయకులు కృష్ణమ నాయుడు, రాఘవేంద్ర రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, పాల్ రెడ్డి, రఘు ప్రసాద్ రెడ్డి, కుమార్, ఎల్లప్ప, వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

**కోసిగి** మండలం దుద్ది గ్రామంలో టిడిపి మండల కన్వీనర్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ జ్ఞానేష్ అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల నాయకులు వక్రాని వెంకటేశ్వర్లు, ఎండిపలి, హనుమంతు, తెలుగు యువత మహాదేవ పాల్గొన్నారు.

మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

హాలహర్విలో మాట్లాడుతున్న సుజాతమ్మ

కోసిగిలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

## 'ఆదోనిని కరువు మండలంగా ప్రకటించాలి'

**ప్రజాశక్తి-ఆదోనిరూరల్**

ఆదోని మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలని పెద్దహరివణం గ్రామస్తులు హెచ్.ఆదినారాయణ, తెలుగు రైతు కర్నూలు పార్లమెంటరీ అధ్యక్షులు ఆదిశేషిరెడ్డి, మాజీ ఎంపిటిసి నాగరాజ్, బసవరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని మండలాన్ని మధ్యస్థ కరువుగా ప్రకటించారని, మున్సిపల్, పట్టణ ప్రాంతాలతో పాటు నీటి పారుదల వసతి కలిగిన గ్రామాలను తొలగించి కేవలం తాగునీటి వరకు మాత్రమే సహాయక చర్యలు పొందేందుకు కలిగి ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒలో స్పష్టంగా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి పంటల పరిస్థితిని తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదోనిని తీవ్ర కరువు మండలంగా ప్రకటించాలని ప్రభుత్వానికి నివేదిక పంపి న్యాయం చేయాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ఎస్సీ కాలనీ తాగునీటి సమస్య

**- స్పందనలో కాలనీవాసుల వినతి**

**ప్రజాశక్తి -పెద్దకడబూరు**

పెద్దకడబూరు ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు తెలిపారు. సోమవారం స్పందనలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమస్యను గతంలో పంచాయతీ సెక్రటరీ, సచివాలయం-2 కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సమస్య ఎస్సీ కాలనీవాసులకు సంబంధించినది కావడంతో చిన్నచూపు చూస్తున్నారని చెప్పారు. ఇటీవల తాగునీటి విషయమై కాలనీలోని స్త్రీలు గొడవ కూడా పడ్డారని తెలిపారు. అధికారులు స్పందించడం లేదని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకపోతే కాలనీవాసులందరూ ఖాళీ బిందెలతో తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## జాతీయ స్థాయికి ఆదోని విద్యార్థి

**ప్రజాశక్తి - ఆదోని**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పి.తస్లీమా జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సంజన్న తెలిపారు. సోమవారం ఆదోనిలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. పశ్చిమ గోదావరి జిల్లా వీరవసరంలో జరిగిన యోగా క్రీడలో రెండో స్థానంలో నిలిచారన్నారు. అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వ్యాయామ అధ్యాపకులు చిట్టి ప్రసాద్, గ్రంథాలయ అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోవిందరాజులు, జంతు శాస్త్ర అధ్యాపకులు వేదవతి తస్లీమాను సన్మానించి అభినందించారు. అధ్యాపకులు తెలుగు బాబు, బడే సాహెబ్, సూరిబాబు, రంగన్న, శివయ్య, శ్రీనివాసులు, ఈరన్న, శాంతి స్వరూప్, రామాంజనేయులు, కాంతమ్మ, రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, శ్రీనివాసులు, సాధిక్ బాష, మహ్మద్ బాష పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

## పునాది రాళ్లకే పరిమితమా..?

**- డివైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు**

**ప్రజాశక్తి- దేవనకొండ**

కడప ఉక్కు పరిశ్రమ పునాదులకే పరిమితమైందని, ఉక్కు పరిశ్రమ ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కును పరిరక్షించాలని డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈనెల 8న జరిగే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. సోమవారం సిఐటియు కార్యాలయంలో గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాయలసీమ కరువు సీమ అని ఇంకా ఎన్నేళ్లు చెప్పుకుందామని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన చట్టంలో కడుపు ఉక్కు పరిశ్రమ నిర్మించాలని చట్టం చేశారని, ఎందుకు నిర్మించలేదని నిలదీశారు. డివైఎఫ్ఐ నాయకులు నాగేంద్ర, మహేంద్ర, వీరప్ప, జావీద్, అశోక్, వీరేంద్ర పాల్గొన్నారు.

# 8న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

**- వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు**

**ప్రజాశక్తి-ఆలూరు**

కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మైనా, ఎఐవైఎఫ్ జిల్లా సమితి సభ్యులు మునిస్వామి కోరారు. సోమవారం జూనియర్ కళాశాల ఆవరణలో గోడపత్రికలను విడుదల చేసి వారు మాట్లాడారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణకు పూనుకోవడం దారుణమని విమర్శించారు. లాభాలు వస్తున్నా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరణ చేయాలని ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతం కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. మోడీ ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకుండా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని విమర్శించారు. నూతన పరిశ్రమల ఏర్పాటు వంటి విభజన హామీలపై నిర్లక్ష్యం చేస్తున్నా రాష్ట్రంలోని బిజెపి నేతలు మోడీని ఎందుకు అడగడం లేదని విమర్శించారు. డివైఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గిరి మూర్తి, మండల సహాయ కార్యదర్శి అకీర నందన్, జగదీష్, కార్తీక్, ఎఐఎస్ఎఫ్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, నాయకులు నాయక్, విక్రమ్ పాల్గొన్నారు.

గోడ పత్రికలను విడుదల చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాలు

## వలసల నివారణకు కృషి

**- ఎపిఒ విజయమోహన్**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్**

వలసల నివారణకు కృషి చేస్తామని ఎపిఒ విజయమోహన్ తెలిపారు. సోమవారం బనవాసి గ్రామంలో ఉపాధి కూలీలకు టెక్నికల్ అసిస్టెంట్ టి.లక్ష్మి అవగాహన కల్పించారు. రైతులు ఉపాధి హామీ చట్టాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ చట్టం కింద మండలంలో పనులు బాగా జరుగుతున్నాయా లేదా అని టెక్నికల్ అసిస్టెంట్లతో రైతులకు అవగాహన కల్పించారు.

## 'కిడ్డీస్' గుర్తింపు రద్దు చేయాలి'

**ప్రజాశక్తి - ఆదోని**

ప్రభుత్వ నిబంధనలను తుంగులో తొక్కి రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్న కిడ్డీస్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ధణాపురం ఉదయ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోనిలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డుపై ధర్నా చేపట్టారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల పట్టికను స్కూల్ బయట ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కిడ్డీస్‌లో యూనిఫారం ఫీజు, బుక్స్ ఫీజు, ట్యూషన్ ఫీజు ఇలా రకరకాల పేర్లతో ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. విచారణ జరిపి కిడ్డీస్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు వంశీ, అరవింద్, శేఖర్, కృష్ణ, అబ్రహాం నితిన్, నవీన్ పాల్గొన్నారు.

## 24 నుంచి వికలాంగుల హక్కుల పోరుబాట

**- విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు నాగరాజు**

**ప్రజాశక్తి - ఎమ్మిగనూరు**

వికలాంగుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం చేపట్టే వికలాంగుల హక్కుల పోరుబాట యాత్రను జయప్రదం చేయాలని విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిన్న సుబ్బయ్య యాదవ్, జిల్లా అధ్యక్షులు బీసీ.నాగరాజు కోరారు. సోమవారం పట్టణంలోని వికలాంగుల సంక్షేమ కమ్యూనిటీ హాలు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆదోని డివిజన్ నుంచి ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గం మీదుగా కర్నూలు కలెక్టరేట్ వరకు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న కలెక్టరేట్‌కు వికలాంగులు చేరుకొని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీసీ.సోమన్న, ఆదోని డివిజన్ అధ్యక్షులు కె.ఈరన్న, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేష్, తాలూకా అధ్యక్షులు కె.రామాంజనేయులు, తాలూకా ప్రధాన కార్యదర్శి బి.పెద్దయ్య, టౌన్ అధ్యక్షులు బి.రఘువీరా, మండల మహిళా కోశాధికారి కె.విజయ్ లక్ష్మి, మండల కార్యవర్గ సభ్యులు వి.నర్సింహులు, ఎం.నర్సింహులు, కోసిగి మండల అధ్యక్షులు బి.తాయన్న, నందవరం మండల గౌరవాధ్యక్షులు ఎం.నాగరాజు, కోసిగి మండల ఉపాధ్యక్షులు హనుమంతు, మహిళా అధ్యక్షులు యశోదమ్మ, మంత్రాలయం మండల కన్వీనర్ సుధాకర్, మహిళా నాయకులు రాములక్క, పెద్దకడబూరు కన్వీనర్ రామన్న, ఎర్రి స్వామి, ఎమ్మిగనూరు మండల కార్యదర్శి రాజశేఖర్ గౌడ్, గోనెగండ్ల మండల అధ్యక్షులు ఎం.సుంకన్న, పత్తికొండ మండల కన్వీనర్ కె.వినయ్ పాల్గొన్నారు.

గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

## బీవీపై ఆరోపణలు మానుకోవాలి : టిడిపి

**ప్రజాశక్తి - నందవరం**

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డిపై ఆరోపణలు మానుకోవాలని టిడిపి యువ నాయకులు గురురాజ్ దేశాయి, నాగరాజు గౌడ్, ఖాసీం వలీ తెలిపారు. సోమవారం దేశాయి నెట్‌వర్క్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి మాధవ రావు దేశాయికి అనేక పదవులు ఇచ్చారని, నేడు అవమానం జరిగిందంటూ అనడం విడ్డూరంగా ఉందని తెలిపారు. వ్యక్తిగత కారణాలతో స్టే తెచ్చామని నాగరాజు గౌడ్ అంటున్నారని, వారు వ్యక్తిగతంగా తేల్చుకోవాలి తప్ప బీవీపై ఆరోపణలు చేయడం తగదని చెప్పారు. మాధవ రావును ఎందుకు దూరం పెట్టారో టిడిపి నాయకులందరికీ తెలుసని, కొంకతి సత్యనారాయణను ఆయనతో పాటు మరో ముగ్గురు కలవడంతోనే వారిని దూరం పెట్టినట్లు తెలిపారు. టిడిపి సముద్రం లాంటిదని, పార్టీలో ఎవరు వచ్చినా పార్టీలోకి ఆహ్వానించడం బీవీ బాధ్యత అన్నారు. 2019 తర్వాత తాము ఏ పార్టీలోకి వెళ్లలేదని, కేవలం బీవీకి మాత్రమే దూరంగా ఉన్నామని తెలిపారు. మళ్లీ ఆయన సమక్షంలోనే తాము పార్టీలో కొనసాగుతామని చెప్పారు. పార్టీలో ఎంతోమంది ఉన్నా మాధవ రావుకు సముచిత స్థానం కల్పించి, తాలూకా స్థాయి పదవులను బీవీ కట్టపెట్టారని తెలిపారు. టిడిపి నాయకులు సోమలగూడూరు శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, ఐటిడిపి వీరేష్, రామన్న గౌడ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు గురురాజ్ దేశాయి

## 'ప్రశాంత వాతావరణంలో జీవించాలి'

**నందవరం :** గ్రామంలోని ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో జీవించాలని, అందుకు తగ్గట్లు ప్రజలు నడవడికలను మార్చుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ బి.సీతా రామయ్య తెలిపారు. సోమవారం కనకవీడు గ్రామంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో అల్లర్లు, గొడవల్లో పాల్గొనకుండా శాంతి యుత వాతావరణంలో జీవించాలని తెలిపారు. ప్రజలందరూ చట్టాలపై అవగాహన కల్పించి, పలు సూచనలు అందించారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సామరస్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. ఎమ్మిగనూరు రూరల్ సిఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ తిమ్మయ్య పాల్గొన్నారు.

## హోళగుంద బస్సు నడపాలి

**- సింగిల్ విండో మాజీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి**

**ప్రజాశక్తి - హోళగుంద**

బళ్లారి డిపో నుంచి సాయంత్రం 6 గంటలకు కొత్త బస్సు సర్వీసులు నడిపి, మరుసటి రోజు ఉదయం 6 గంటలకు హోళగుంద నుంచి బస్సు నడపాలని సింగిల్ విండో మాజీ ఛైర్మన్ ఎన్.శ్రీనివాసరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పెద్దహేట మారెప్ప, ఆలూరు తాలూకా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ ఛైర్మన్ సి.మంగయ్య, యువజన సంఘం మండల నాయకులు కె.రంగన్న కోరారు. సోమవారం కెఎస్ఆర్‌టిసి బళ్లారి డివిజనల్ కంట్రోల్ అధికారికి, డిపిఒ చామరసకు, బళ్లారి డిపో-2లోని ఎటిఎస్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. హోళగుంద నుంచి చదువు కోసం విద్యార్థులు, వ్యాపారం కోసం వ్యాపారులు, చికిత్స నిమిత్తం రోగులు, రోగుల బంధువులు అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్నారని తెలిపారు. సాయంత్రం పూట బస్సుల్లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. బళ్లారి నుంచి హోళగుందకు నైట్ ఆల్ట్ కొత్త బస్సు సర్వీసును నడపాలని డిమాండ్ చేశారు. డిపిఒ చామరస మాట్లాడుతూ... అంతర్రాష్ట్ర బస్సు సర్వీసులు నడపడానికి చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా ఎల్లార్తి, హోళగుంద, పాల్తూర్ బస్సులు నడపడానికి ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : #9-123-2, ఫస్ట్‌ఫ్లోర్, కొత్తపేట, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఎదురు, డోన్, కర్నూలు జిల్లా.
- # 3510-1-6, ఫస్ట్‌ఫ్లోర్, ఆదోని బైపాస్‌రోడ్, తిప్పన్నగౌడ్ కాంప్లెక్స్, ఎమ్మిగనూరు.
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-11-2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 571 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
అథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 99666 44110

## సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థిని ప్రతిభ

**ప్రజాశక్తి - గోనెగండ్ల**

జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని ప్రతిభ కనబరిచారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే వ్యవస్థను రూపొందించి డిఇఒ రంగారెడ్డి, ఇతర అధికారుల నుంచి ప్రశంసా పత్రం పొందారు. గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పి.రమ్యశ్రీ ఈనెల 4న శనివారం కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్-2023 పోటీల్లో 'పర్యావరణ వ్యవస్థలో కలిగే ఆకస్మిక ఉపద్రవాలైన వరదలు, భూకంపాల వంటి వైపరీత్యాల నుంచి రక్షించుకునే సురక్షిత గృహ నిర్మాణాన్ని ఎలా నిర్మించుకోవాలో, ప్రతికూల పరిస్థితుల నుంచి జన నష్టం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి' అనే ప్రాజెక్టును ప్రదర్శించి ఉత్తమ ప్రాజెక్టుగా బహుమతి పొందిందారు. గైడ్ టీచర్ అమానుల్లా బేగ్‌ను, విద్యార్థిని రమ్యశ్రీని ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది సోమవారం అభినందించారు.

NAME CHANGE
By this deed I, the undersigned MANGALA HANUMANTHAPPA(New Name) Previously called HANUMANTHAPPA MATE S/o M.Chinna Gopal, (Old Name) Resident at H.No.45/161, Narasimhareddy Nagar, Near Railway Station, Kurnool, Kurnool District. Andhra Pradesh.

KURNOOL MUNICIPAL CORPORATION
e-Procurement Notice
Tender Notice No.53-1 to 53-3/General Funds/EE&SE/Knl/23-24, dt.04-11-2023 (3 days Short Tender) &
Tender Notice No.53-4/General Funds/EE&SE/Knl/23-24, dt.04-11-2023 (7 days Short Tender) &
Tender Notice No.53-5 to 53-16/General Funds/EE&SE/Knl/23-24, dt.04-11-2023

| Name of the Scheme | General Funds (3 days Short Tender) | General Funds (7 days Short Tender) | General Funds |
|---|---|---|---|
| No of works | 03 | 01 | 12 |
| Bid document download starting date | 06/11/2023 at 5:30 P.M | 06/11/2023 at 5:30 P.M | 07/11/2023 at 5:30 P.M |
| Bid document download end date | 10/11/2023 at 4:00 P.M | 14 /11/2023 at 4:00 P.M | 24/11/2023 at 4:00 P.M |
| Last Date & Time for receipt of Bids | 10/11/2023 at 5:00 P.M | 14/11/2023 at 5:00 P.M | 24/11/2023 at 5:00 P.M |
| Commercial Bid Opening Date | 10/11/2023 at 5:30 P.M | 14/11/2023 at 5:30 P.M | 24/11/2023 at 5:30 P.M |

Further details and Corrigendum can be seen @ e procurement market place at www.tender.apeprocurement.gov.in A.Bhargav Teja, I.A.S., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool. For Contact 9849908497, 9849908470.
Sd/-A.Bhargav Teja, I.A.S., Commissioner, Kurnool Municipal Corporation, Kurnool.

ఓటర్ల జాబితా పై మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- బేతంచెర్లలో రూ.30 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

బహిరంగ సభలో మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

**ప్రజాశక్తి - బేతంచర్ల**

తాము అభివృద్ధి చేశామని చెప్పేదానికన్నా అభివృద్ధి చేసే అవకాశం కల్పించిన డోన్ నియోజకవర్గ ప్రజల గొప్ప విజయమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం బేతంచెర్ల మండలంలో రూ.30 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఎంపిపి బుగ్గన నాగభూషణం రెడ్డి అధ్యక్షతన హెచ్.కొట్టాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. మీ అందరి సహకారంతో రాష్ట్రంలో డోన్ నియోజకవర్గాన్ని మోడల్ గా తీర్చిదిద్దే అవకాశం వచ్చిందన్నారు. గతంలో వైసిపి అధికారంలో లేకున్నా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించినప్పుడు ఏ అభివృద్ధి కార్యక్రమం చేయకపోయినా మరలా 2019 అసెంబ్లీ ఎన్నికలలో వైసిపికి పట్టంగట్టి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసి తనను కూడా గెలిపించిన మీ అందరికీ కృతజ్ఞుడనై ఈ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. మీరిచ్చిన అవకాశం, సిఎం నమ్మకంతో రాష్ట్రంలోనే డోన్‌ను మోడల్‌గా తీర్చిదిద్దామని అన్నారు. అంతేకాకుండా నన్ను గెలిపించిన డోన్ ప్రజల మనసు గెలుచుకునేలా మౌలికసదుపాయాల కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. డిసెంబర్ కల్లా డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటికి తాగునీరు అందజేస్తున్నామని తెలిపారు. నాలుగేళ్లలోనే ఐటిఐ, పాలిటెక్నిక్, ఎమ్ఎస్ఎంఇ వంటి విద్యాసంస్థలు నెలకొల్పామన్నారు. రూ.750 కోట్లతో నియో జకవర్గంలోనే మొదలై..అంతమయ్యే ఏకైక జాతీయ రహదారి డోన్‌కు తెచ్చిన ఘనత వైసిపిదే అన్నారు. కులం, మతం, ప్రాంతం, వర్గాలకతీతంగా సంక్షేమం, అభివృద్ధి చేశామన్నారు. జాతీయ రహదారి నిర్మాణం పూర్తయితే ఏడాదిలోనే కొట్టాల గ్రామ ప్రజలు కోటీశ్వరులవడం ఖాయమని అన్నారు. బేతంచెర్ల పిహెచ్‌సిని 30 పడకల సిహెచ్‌సిగా తీర్చిద్దుతామని, గత ప్రభుత్వ పరిపాలనలో బేతంచెర్లలో తుపాకులతో బెదిరించిన పాలన నుంచి స్వేచ్ఛగా బతికే వ్యవస్థను రూపొందించామని అన్నారు. ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, జడ్పిటిసి చైర్మన్ పాపిరెడ్డి, మాట్లాడుతూ మంత్రి బుగ్గన డోన్ నియోజ కవర్గ ఎమ్మెల్యేగా గెలిపించుకున్న ప్రజల అదృష్టం అని వారన్నారు. రూ.2,500 కోట్లతో అభివద్ధి పనులన్నీ పూర్తి చేసిన ఏకైక నాయకుడు మంత్రి బుగ్గన అని వారు కొనియాడారు. రూ.2.5 లక్షల సిఎం సహాయ నిధికింద హెచ్‌కొట్టాల నివాసి ఎందురూరి రామ్మోహన్‌కు చెక్కును అందజేశారు. అంతకు ముందు బేతంచెర్ల కర్నూలు రోడ్‌లోని అయ్యల చెరువు నుండి బనగానపల్లి రోడ్‌లో గల కస్తూర్బా స్కూల్ వరకు, బేతంచెర్ల నుండి డోన్ రోడ్డులో హెచ్.కొట్టాల వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం అయ్యల చెరువు నుండి హెచ్ కొటాల వరకు ఆర్థిక మంత్రి, ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఎర్రపోతుల పాపిరెడ్డి, తదితర ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాదయాత్ర చేశారు. వైఎస్ఆర్ అభిమానులు గజమాలలతో ఆర్థిక మంత్రి బుగ్గనను అడుగడుగునా సన్మానించారు. హెచ్‌కొటాల గ్రామంలో కోటి రూ.15 లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి శివలక్ష్మి, బేతంచెర్ల మున్సిపల్ చైర్మన్ చలం రెడ్డి, మద్దలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, బేతంచెర్ల మండల వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, కోడే వెంకటేశ్వర్లు, ముస్లిం మైనార్టీ ఫైనల్స్ డైరెక్టర్ వైస్ ఖాజా హుస్సేన్, మూర్తుజావలి, వైస్ ఎంపిపి రంగస్వామి, బేతంచెర్ల తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఇన్చార్జ్ ఎంపీడీవో దస్తగిరి బాబు, ఎంఇఒ సోమశేఖర్, ఆర్ అండ్ బి ఎస్ సి నాగరాజు, డిఇ. ఇ ప్రసాద్ రెడ్డి, ఇఇ. శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించండి

- జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సామూన్ ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటనరీ హాలులో స్వచ్ఛ మైన ఓటర్ల జాబితా రూపకల్పనపై ఈఆర్వో, ఏఈఆర్వోలు, అన్ని మండ లాల తాసి ల్దారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య, అన్ని నియోజక వర్గాల ఈఆర్వో, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు తావివ్వ కుండా పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ఈఆర్వో, ఏఈఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పాణ్యం నియోజక వర్గం నంద్యాల జిల్లా నుండే ఎన్నికల ప్రక్రియ నిర్వహణ చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించిందని ఈ మేరకు సంబంధిత అధికారులు పూర్తిస్థాయి దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశి ంచారు. ఒకే ఇంటిలో పది ఓట్లకు మించి ఓటర్లు ఉన్నట్లయితే మరోసారి రీ వెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ సూచించారు. జంక్ క్యారెక్టర్స్ ఉన్న లోపాలు, చిరునామాలో మార్పులు, ఫోటో మిస్ మ్యాచింగ్ తదితర లోపాలు లేకుండా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం చేయా లని కలెక్టర్ ఆదేశించారు. ఒక పోలింగ్ స్టేషన్ లో 2 శాతం ఓట్ల తొలగి ంపులు, 4 శాతం ఓట్ల చేర్పులు ఉంటే ఈఆర్ఓలు నిశితంగా పరిశీలించి ఇందుకు సంబంధించిన కారణాలను రికార్డులలో నమోదు చేయాలన్నారు.

గోడ పత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

# చలో విజయవాడను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - నంద్యాల**

ఈ నెల 15 తేదీన సిపిఎం ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం నాడు సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రమేష్ కుమార్, సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, సిపిఎం సీనియర్ నాయకులు తోట మద్దులు, రామరాజు, కార్యదర్శివర్గ సభ్యులు డి లక్ష్మణ్, వెంకట లింగం పట్టణ నాయకులు మాదాల శ్రీనివాసులు,జైలాన్, శివ తదితరులు గోడ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా టి రమేష్ కుమార్ మాట్లాడు తూ ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు మన అందరిని కలవర పరుస్తున్నాయన్నారు. ఎవ్వరో వచ్చి ఉద్ధరిస్తారని ఎదురు చూసే కన్నా మన బతుకులను రాష్ట్ర భవిష్యత్తును సరైన మార్గాన నడిపించడానికి ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించవలసిన సమయం వచ్చిందన్నారు. ఈ ఉద్యమంలో సిపిఎం మీతో పాటు ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తి కావస్తుందని, కేంద్రంలో బిజెపి నాయకులు ప్రత్యేక హెూదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ ,రాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ,కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటు, రైల్వే జోన్ లాంటివి ఏ ఒక్కటి అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని నిలువున ముంచిన బిజెపి అంతటితో ఆగకుండా మన రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగ నమ్మడానికి తయారైందన్నారు. బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగా తయారయిందని, బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో మైనార్టీలకు భద్రత లేకుండా పోయిందన్నారు. కోట్లాదిమంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్లను తెచ్చిందని, దేశ వ్యవసాయానికి ప్రజల ఆహార భద్రతకు ముప్పు తెచ్చే నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చిందన్నారు. అదేవిధంగా పోర్టులని ఆదానికి అప్పజెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఇంతలా దేశాన్ని నాశనం చేసే బిజెపి పార్టీని రాష్ట్ర అధికార పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గాని, అదేవిధంగా జనసేన, టిడిపి పార్టీలు గాని బిజెపికి మద్దతు తెలపడం సిగ్గుచేటు అని వారు అన్నారు. సిఎం జగన్ మూడు రాజధానుల జపం చేస్తూ కేంద్రం చెప్పినట్లు తలాడిస్తూ రాష్ట్ర ప్రజల పైన మోయలేని భారాలను వేస్తున్నారన్నారు. విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు, మోటార్లకు మీటర్ల పేరుతో ఆస్తి పన్ను నుంచి చెత్త పన్ను దాకా అన్ని వడ్డింపులతో ప్రజలపై భారాలు మోపుతున్నారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ విద్యా విధానంతో ప్రభుత్వ పాఠశాలలు మూతబడుతున్నాయని, ప్రభుత్వ ఆసుపత్రులు నామమాత్రంగా తయారవడంతో కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి సామాన్యులు బలైపోతున్నారని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యా యులకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి జిపిఎస్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. అంగన్వాడీలకు, ఆశలకు కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు చేసిన వాగ్దానాలన్నీ గాలికి ఎగిరిపోయాయన్నారు. రైతులు, నిరుద్యోగులు, చేతివృత్తులు, కౌలు రైతులు ఈ ప్రభుత్వానికి కనబడడం లేదన్నారు. వీటిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే చలో విజయ వాడ, ప్రజారక్షణ భేరి సభకు ప్రజలందరూ హాజరుకావాలని కోరారు.

# దారి దోపిడీ ముఠా అరెస్ట్

- రూ.2.10 లక్షల వస్తువులు స్వాధీనం

అరెస్ట్ అయిన ముద్దాయిలను చూపుతున్న జిల్లా ఎస్పీ

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

జిల్లాలోని గత కొద్దినెలలుగా మోటార్ సైకిల్‌లపైన ప్రయాణించే వ్యక్తులను అడ్డగించి, మారణాయిధాలతో దాడి చేసి, బెదిరించి నగలు, డబ్బులని దోపిడీ చేసే దారి దోపిడీ ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కె రఘువీర్ రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. దారి దోపిడీ ముఠాను అరెస్టు చేసి వారి నుండి దాదాపు రూ.2లక్షల 10వేలు విలువ గల వస్తువులు స్వాధీనం చేసుకొని రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఒక బంగారు సాదా చైన్–బరువు 7 గ్రాములు, ఒక నల్ల పూసల దండ - బరువు 10 గ్రాములు, ఒక బంగారు బ్రేస్ లెట్ – బరువు 7 గ్రాములు, రెండు బంగారు ఉంగరాలు – బరువు 4 గ్రాములు, ఒక జత బంగారు చెవి కమ్మలు– బరువు 3 గ్రాములు, ఒక బంగారు ముక్కు పుడక, ఒక సెల్ ఫోన్,ఒక జత కాళ్ళ వెండి పట్టీలు –బరువు 150 గ్రాములు మొత్తము సుమారు 31 గ్రాముల బంగారు ఆభరణాలు, 150 గ్రాముల ఒక జత కాళ్ళ వెండి పట్టీలు, ఒక సెల్ ఫోన్ మొత్తం విలువ రూ.2లక్షల 10 వేలు సొత్తును రికవరీ చేసినట్లు తెలిపారు. అరెస్టు అయిన వారిలో చెంచు దాసరి వీరయ్య ఏ గడ్డల వీరయ్య,చెంచు దాసరి రామకృష్ణ, చిగుర్ల గోలుసన్న ఏ గొలుసు గాడు, నిమ్మల వీరన్న, తోట రాజేష్, జయంపు సురేశ్ ఉన్నారన్నారు. వీరం దరిది పాణ్యం గ్రామము మండలం.ఇందిరా నగర్(చెంచు కాలనీ) స్వ గ్రామమని ఇంకా చెంచు దాసరి గొలుసన్న,చెంచు దాసరి అశోక్, చెంచు దాసరి నరసింహులు పరారిలో ఉన్నారని వీరిని కుడా త్వరలో అరెస్టు చేస్తామని జిల్లా ఎస్పీ కె. రఘు వీర్ రెడ్డి తెలిపారు. ఈ చర్యలకు పాల్పడుతున్న ముఠాను సోమవారం పాణ్యం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి పాణ్యం మండలం తమ్మరాజుపల్లి గ్రామము దగ్గర గల రాజస్థాన్ డాబా దగ్గర పై ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి పలు కేసుల్లో చోరీ కాబడిన పై వస్తువులను,నేరము చేయడానికి ఉపయోగించిన 3 కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ నేరస్థులు అనేక కేసులలో అరెస్టు అయారని వారి పైన నంద్యాల రూరల్,నంద్యాల,పాణ్యం, గడివేముల, డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ లలో కేసులు పెండింగ్ లో ఉన్నాయ న్నారు. నేరస్థులను అరెస్టు చేయడములో కీలక పాత్ర పోషించిన పాణ్యం సీఐ డి వేంకటేశ్వర రావు, పాణ్యం ఎస్ఐ పి.అశోక్, గడివేముల ఎస్ఐ బీటి వెంకట సుబ్బయ్య వారి సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.

# ఆశాలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

- సిఐటియు డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న యేసురత్నం

**ప్రజాశక్తి - నంద్యాల**

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యేసు రత్నం, ఏ నాగరాజు, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమణకుమారిలు డిమాండ్ చేశారు. సోమవారం నాడు ఆశా వర్కర్స్ యూనియన్ నంద్యాల జిల్లా కమిటీ సమావేశం వెంకట లక్ష్మమ్మ అధ్యక్షతన నరసింహయ్య భవనంలో వారు మాట్లాడుతూ ఆశా వర్కర్స్‌కు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా కార్య కర్తలు పని భారంతో యాప్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆశాలకు సంబంధం లేని పనులు చేయించరాదన్నారు. ఆశ కార్యకర్తలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ ఒత్తిడి లేకుండా చూడాలని కోరారు. ఎన్ హెచ్ ఎం ను శాశ్వత ప్రోగ్రాంగా మార్చాలని, ఆశా కార్యకర్తలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఆరు నెలలు ఇవ్వాలని అన్ని పీహెచ్సీలు, సిహెచ్సి లలో, ఆసుపత్రులలో ఆశాలకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. ఆశ కార్యకర్తలకు సామాజిక భద్రత సౌకర్యాలు అన్ని కల్పించాలని, ఆశా కార్యకర్తలకు రిటర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని కనీసం నెలకు పదివేల రూపాయలు రిటర్మెంట్ అయితే ఇవ్వాలని నేటికీ కొన్ని పీహెచ్సీలలో వ్యాక్సిన్ క్యారియర్ బాక్స్ ఆశ వర్కర్లతో తెప్పించుకుంటున్నారన్నారు. జిల్లా అధికారులు స్పందించి ఆశా కార్యకర్తలకు అదనపు పనులను అప్పగించరాదని కోరారు. ఆశ కార్యకర్తకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, డిసెంబర్ నెలలో ఆశా కార్యకర్తలు 36 గంటల మహా ధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో షమీమ్, భారతి, ఎన్ శివలక్ష్మి, చెన్నమ్మ, కృపావతి, రసూల్ బి, సువర్ణమ్మ, భాగ్యమ్మ, లక్ష్మీదేవి, శిరోమనమ్మ, శివమ్మ,లలితమ్మ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా బ్యాలెట్‌ను నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

# విద్యుత్ భారాలపై ప్రజా వ్యతిరేకత

- సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌లో స్పష్టత

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

విద్యుత్ ఛార్జీల భారాలపై ప్రజా వ్యతిరేకత భారీ స్థాయిలో ఉందనిసిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు పేర్కొన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సిపిఎం నాయకులు సోమవారం నందికొట్కూరు పట్టణం లోని పటేల్ సెంటర్ నందు ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. పలు వర్గాల ప్రజల నుండి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుపై సోమవారం నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌కు 500 మందిలో 495 మంది చార్జీల పెంపును వ్యతిరేకించారన్నారు. సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను గుప్పెట్లో పెట్టుకుందని విమర్శిం చారు. గతంలో తెదేపా ప్రస్తుతం వైకాపా ప్రభుత్వం వివిధ రకాల రుసుములు పేరుతో వినియోగదారులపై మోయలేని భారాన్ని మోపుతు న్నాయన్నారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా రానున్న ఎన్నికల్లో ప్రజలు వైకాపా ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి,పకీర్ సాహెబ్ టి గోపాలకృష్ణ, సి నాగన్న, కొంగర వెంకటే శ్వర్లు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డక్క కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు హరివర్ధన్, రామసుబ్బయ్య, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వి. వెంకటేశ్వర్లుకు మాతృవియోగం

**ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్**

టాటా మ్యాజిక్ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి వెంకటేశ్వర్లు తల్లిగారు వి సాలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు స్వగ్రామమైన కొణిదెల గ్రామంలో నిర్వహిం చారు. సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు పి పకీరు సాహెబ్ బెస్తరాజు, సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ, వ్యకాస మండల నాయకులు కొంగర వెంకటేశ్వర్లు, ఆమె కుటుంబానికి ప్ర గాఢ సానుభూతి తెలిపి మృతదేహానికి నివాళులర్పించారు.

మృతదేహానికి పూలమాల వేస్తున్న సిపిఎం నేతలు

# ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్లు

- సంబరాలు చేసుకున్న వైసిపి నేతలు

సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పన యాత్రకు ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వైసిపి శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

**ప్రజాశక్తి - విలేకరులు**

**నందికొట్కూర్ టౌన్ :** సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప మహా పాదయాత్ర చేపట్టి 6 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, నందికొట్కూరు పట్టణంలోని, అల్లూరు రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్లో వైఎస్ఆర్ విగ్రహానికి నందికొట్కూరు శాసనసభ్యులు తొగురు ఆర్థర్ పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ శుకూర్, మున్సిపల్ కౌన్సిలర్లు ధర్మారెడ్డి, శ్మొల్ల జాకీర్ హుస్సేన్, వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వనజ, జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్. ఇనాయతుల్లా, మాజీ సింగిల్ విండో చైర్మన్ చందమాల బాలస్వామి, వైసీపీ నాయకులు పెరుమాళ జాన్, తమడపల్లి విక్టర్, అయ్యన్న, శాతనకోట వెంకటేశ్వర్లు, భాస్కర్, వలి, శంకరయ్య, ముజీబ్, శ్రీనాథ రెడ్డి, వెంకటస్వామి, నాయకులు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్:** వైసిపి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్న సంజీవరెడ్డి, సర్పంచ్ ఎరుకలి సంధ్య, మాజీ ఎంపీపీ దేశు, వెంకట్రాంరెడ్డిల ఆధ్వర్యం లో స్థానిక బస్టాండ్ నందు వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రైతు సలహా మండలి అధ్యక్షుడు కృష్ణ మల్లారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ అవుటాలా నాగేశ్వర్ రెడ్డి, ఎస్ సుబ్బారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ విక్రమసింహ పరమటూరు సహకార సంఘం అధ్యక్షులు బూరం శివలింగం, జెసిఎస్ కన్వీనర్ ముడి మేళ పుల్లారెడ్డి, పరమట సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి, శాఖమూరి సుబ్బారెడ్డి, నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు :** ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందనివైసిపి జేసీఎస్ నాయకులు ఎం.ఏ. రజాక్ పేర్కొన్నారు. సున్నిపెంటలో శ్రీశైలం నియోజకవర్గం ప్రజా సంకల్ప యాత్రకు ఆరేళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్ నందు దివంగత నేత వైఎస్ఆర్ విగ్రహాల దగ్గర కేకును కట్ చేసి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైసీపీ నాయకులు రఫీ, ప్రవీణ్ తేజ, ప్రభావతి వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు. **పగిడ్యాల :** జెడ్పిటిసి పుల్యాల దివ్య, మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డిల ఆధ్వర్యంలో పగిడ్యాల బస్టాండ్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, వైసిపి నాయకులు పల్లె సత్యనారాయణ రెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **చాగలమర్రి:** జిల్లా సచివాలయాల జెసిఎస్ చైర్మన్, వైసీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్ చాగలమర్రిలోని వైయస్సార్ కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఉప సర్పంచ్ షైక్ సోహెల్, మండల ఉపాధ్యక్షుడు రఫీ, ఎంపిటీసీ ఫయాజ్, మండల ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

పగిడ్యాల : వైఎస్ఆర్ విగ్రహానికి నివాళు లర్పిస్తున్న నాయకులు

చాగలమర్రిలో

బండి ఆత్మకూరులో..

వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

# మహిళ సమాఖ్య రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలి

**ప్రజాశక్తి - బనగానపల్లె**

ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 15వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివ బాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో సిపిఐ, ఏఐటీయూసీ, మహిళా సమైక్య ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య 15 వ రాష్ట్ర మహాసభల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివ బాలకృష్ణ మాట్లాడు తూ ఈనెల 17, 18,19 తేదీలలో నంద్యాల పట్టణంలో జరిగే రాష్ట్ర మహిళా సమైక్య మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనునిత్యం మహిళల అభ్యున్నతి కోసం, హక్కుల కోసం, రక్షణ కోసం పోరాడే సంఘం ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య అన్నారు. ఈ ప్రచారంలో సిపిఐ, ఏఐటియుసి నాయకులు పాల్గొన్నారు.

# పండ్ల తోటల పెంపకంపై చెంచులకు అవగాహన

**ప్రజాశక్తి - రుద్రవరం**

పండ్ల తోటల పెంపకంపై చెంచులకు అవగాహన కార్యక్రమాన్ని ఐటిడిఏ ప్రోగ్రాం ఆఫీసర్ రవీంద్రనాథ్ రెడ్డి నిర్వహించారు. సోమవారం మండలంలోని హరినగరం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఐటిడిఏ పథకం కింద చెంచులు స్వయంగా తమ పొలాలలో మామిడి చెట్లు, షరబత్, ఇతర పలసాయాలని ఇచ్చే పండ్ల మొక్కలను పెంచుకునేందుకు ఐటిడిఏ తరపున తరపున 100 శాతం సబ్సిడీతో మొక్కల సరఫరా ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే నీటి వసతి కోసం బోరు బావులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు సవరం నాగ ముని పాల్గొని ఐటిడిఏ ప్రోగ్రాం ఆఫీసర్ రవీంద్రనాథ్ రెడ్డిని సన్మానించారు. గ్రామస్తులు పాములేటి ,రవి పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐసిడిఏ అధికారులను సన్మానిస్తున్న

# వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : టిడిపి

మేనిఫెస్టో వివరాలు వెల్లడించిన బిసి ఇందిరమ్మ

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం అని, అభివృద్ధి, సంక్షేమం రెండూ టీడీపీతోనే సాధ్యమని మాజీ శాసన సభ్యులు బిసి జనార్ధనరెడ్డి సతీమణి బిసి ఇందిరమ్మ అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు నాగిశెట్టిపల్లె (రామకృష్ణాపురం)గ్రామంలో ఇంటింటికి తిరిగి అధికారంలో వస్తే చేపట్టే పథకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బిసి ఇందిరమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరామిరెడ్డి, చిన్న పుల్లయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**ప్యాపిలి :** రాబోయే సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో, డోన్ నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరేస్తామని టీడీపీ సీనియర్ నాయకులు పెద్దనాగిరెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం లో భాగంగా 11వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమ ంలో రామ్మోహన్ యాదవ్,చిన్న సుంకయ్య, సుదర్శన్, చల్లా వీర,నాగేంద్ర, రామాంజనేయులు,రాజు పాల్గొన్నారు.

**నందికొట్కూరు :** నందికొట్కూరు పట్టణంలోని మున్సిపాలిటీ 22వ వార్డులో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొల్లెద్దుల రాజన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను వివరించారు. కార్యక్రమంలో ప్రేమ్, పుష్పరాజు, ప్రవీణ్, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

## రైతులపై కేసులను ఎత్తివేయాలి

- ఎపి రైతు సంఘం డిమాండ్

**ప్రజాశక్తి - పాములపాడు**

బిజెపి ప్రభుత్వం ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమంపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పాములపాడు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎఫ్ఐఆర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్నలు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తెచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని రైతులు ఢిల్లీలో చేపట్టిన ఉద్యమంపై పెట్టిన కేసులను తక్షణమే రద్దు చేయాలన్నారు. కేసులను, నల్ల చట్టాలను రద్దు చేస్తామని ప్రధాని చెప్పినా నేటికీ అవి ఆచరణలో లేవన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నాయకులు స్వాములు, రైతు సంఘం నాయకులు కోట్ల నాగేశ్వర్ రెడ్డి, వై ఆర్‌డిఎస్ అధ్యక్షులు షర్ఫుద్దీన్ అలీ, మాల మహానాడు నాయకులు అబ్రహాము పాల్గొన్నారు.

## అడిగిన ప్రతి ఒక్కరికీ 'ఉపాధి' : పిడి

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ చంద్రా రెడ్డి తెలిపారు. సోమవారం ఆయనను కలిసిన ప్రజాశక్తి తో మాట్లాడుతూ జిల్లాలో 61 రోజులు,70, రోజులు 80 రోజులు ఇలా పని చేసిన వారు జిల్లాలో 36 వేల పైన పని దినాలు పెండింగులో ఉన్నాయని వారందరికీ వంద పని దినాలు కల్పించ డమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. హౌసింగ్‌లో 90 పనిదినాలు, ఉద్యాన శాఖలో 100 పనిదినాలు కల్పించ డంతో పాటు పెండింగులో ఉన్న వారికీ కూడా పనులు కల్పిస్తున్నామ న్నారు. జిల్లాలో 61 పని దినాలనుండి వంద పనిదినాల వరకు చేయాల్సిన వారు 10,588 మంది,71 నుండి 100 వరకు చేయాల్సిన వారు 8,481 మంది,81 నుండి వంద వరకు చేయాల్సిన వారు 15,320 మంది ఉన్నారని పీడీ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో కుడా పనులు లేక అవస్థలుపడుతున్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

## టిడిపి నేత మృతి

**ప్రజాశక్తి - మిడుతూరు**

మండల కేంద్రంలోని టిడిపి నాయకులు ఖాతా చంద్రశేఖర్ రెడ్డి (70) మృతి చెందాడు. ఆదివారం రోజు బెంగళూరులో గుండెపోటుతో మృతి చెందాడని సోమవారం తెల్లవారుజామున స్వగ్రామమైన మిడు తూరుకు తీసుకొచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న నందికొట్కూర్ టిడిపి ఇన్చార్జి గౌరు వెంకట్ రెడ్డి, మాండ్ర లింగా రెడ్డి మిడుతూరుకు వచ్చి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతిమయాత్రలో మండలంలోని వివిధ గ్రామాల నాయకులు పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

నివాళులు అర్పిస్తున్న గౌరు వెంకటరెడ్డి, మాండ్ర లింగారెడ్డి

## ఎంఆర్‌పిఎస్ సభను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - సంజామల**

మాదిగలంతా ఈనెల 11వ తేదీన హైదరాబాదులో జరిగే ఎంఆర్‌పిఎస్ సభకు వచ్చి జయప్రదం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటరమణ సోమవారం కోరారు. ఈ సభకు ప్రధాని నరేంద్ర మోడీ వస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం మండలంలోని గిద్దలూరు లింగం దిన్నెలో సభలు నిర్వహించి ఆయన తెలియజేశారు.

పోస్టర్లను అతికిస్తున్న నేతలు

## విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

- డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ

**ప్రజాశక్తి - నంద్యాల**

ఈనెల 8వ తేదీ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని పరిరక్షణకు కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కొరకు చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ, ఎస్ఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి మధు కిరణ్ కోరారు. ఈ సందర్భంగా సోమవారం నాడు వారు వాల్ పోస్టర్లు గోడలకు అతికిస్తూ ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ కడప ఉక్కు రాయలసీమ హక్కు, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుల కోసం ప్రతి విద్యార్థి పోరాటాల్లో కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్, గౌతమ్ ,మధు, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు శాంతిరాం విద్యార్థిని

**ప్రజాశక్తి - పాణ్యం**

మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఈఈఈ విద్యార్థిని బి. నమ్రత జాతీయ ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్స్ ఫుట్బాల్ ఛాంపియన్షిప్ పోటీలలో నమ్రత జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని నడియాలో జరిగే 28వ జాతీయస్థాయి మహిళల ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో నమ్రత పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా నమ్రతను ఫిజికల్ డైరెక్టర్ చంద్రారెడ్డిని కళాశాల ఎండి శివరాం అభినందించారు. ఈ హెచ్ ఓ డి వీరేష్ అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

విద్యార్థిని అభినంది స్తున్న కళాశాల యాజమా న్యం

# న్యూస్ క్లిక్‌పై దాడి స్వేచ్ఛకు ప్రమాదకరం

**ప్రజాశక్తి - ఆత్మకూరు**

న్యూస్ క్లిక్ కార్యాలయంపైన దాంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి నివాసాలపైన ఢిల్లీ పోలీసులు దుర్మార్గంగా ఇష్టానుసారంగా దాడులు చేయడం సరికాదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షులు మా బాష, కార్యదర్శి వీరన్న, సిఐటియు పట్టణ, కార్యదర్శి రామ్ నాయక్‌లు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందర, నంద్యాల టర్నింగ్‌లో ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కాపీలు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ఇతర ఉద్యోగులు ఉపయోగించే ఎలక్ట్రానిక్ పరికరాలను కనీస నిబంధనలు పాటించకుండా తీసుకెళ్లారన్నారు. అందులోని డేటాకు సంబంధించి ఎలాంటి రసీదులు ఇవ్వలేదన్నారు. 2014 నుంచి నేటి వరకు అనేకమంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారని కావున జర్నలిస్టులు, న్యాయవాదులు, రాజకీయ, సామాజిక కార్యకర్తలు ప్రజలు నిరసనలు తెలియజేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పండ్ల తోటలో సహకార సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా, ఎపి వ్యకాసం నాయకులు నరసింహ నాయక్, సిఐటియు నాయకులు ఏ. రణధీర్, పట్టణ పౌర సమాఖ్య నాయకులు ఏ సురేంద్ర, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఏ కిరణ్, పాల శివుడు, రైతులు లింగమూర్తి, నరసింహుడు, మోమిన్ ఖలీముల్లా, బాబు, బొల్లు లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి

# యాంత్రీకరణతో అధిక దిగుబడులు : ఎంపి

**ప్రజాశక్తి - చాగలమర్రి**

రైతులు యాంత్రీకరణతో అధిక దిగుబడులు సాధించ వచ్చని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందారెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక బుగ్గ రస్తాలో పొలాల వద్ద రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాంత్రీకరణ పద్ధతుల ద్వారా రైతులు వ్యవసాయం చేస్తే అతి తక్కువ ఖర్చుతో, ఎక్కువ లాభాలు పొందటంతో పాటు తక్కువ కాలం పడుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం భారతి సీడ్స్ అధినేత పోచా జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యవసా యంలో డ్రోన్‌ల వినియోగాన్ని పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో కంపెని ప్రతినిధులు శ్రీకాంత్‌పాటిల్, సుబ్బారెడ్డి, రాజేష్ రెడ్డి,ఆర్గనైజర్లు శ్రీనివాస రెడ్డి, కేటకే రెడ్డి,అజయ్, సమర్థ్,పవన్,ఇతీష్,ఉల్లి నాగేంద్ర ప్రసాద్, అమర్,షాకీర్, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# జనసేనలో చేరిన ఇరిగెల బ్రదర్స్

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వైకాపాకు భారీ షాక్ తగిలింది. ఆళ్లగడ్డ నియోజకవర్గ వైకాపా నాయకులు ఇరిగేల రాంపుల్లారెడ్డి, సోదరులు ఇరిగెల రామచంద్రారెడ్డి, ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి, ఎస్.లింగందిన్నె సర్పంచ్ ఇరిగెల విశ్వనాథ్ రెడ్డి, ఇరిగెల ప్రతాప్ రెడ్డిలు జనసేనాని పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఇరిగెల బ్రదర్స్ కలిశారు. వారికి పార్టీ కండువా కప్పి పవన్ కళ్యాణ్ వారిని సాదరంగా ఆహ్వానించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి కృషి చేయాలని పవన్ వారికి సూచించారు. జనసేనలో చేరిన సందర్భంగా ఇరిగెల రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో జనసేనను బలోపేతం చేసి మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. జన సైనికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు, తమ కార్యకర్తలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి దిశా దశ నిర్ణయిస్తామన్నారు. కాగా అటు అంగ ఇటు ఆర్థిక బలమున్న ఇరిగెల సోదరులు జనసేనలో చేరడం ఆళ్లగడ్డ రాజకీయంలో చెప్పుకోదగ్గ అంశంగా మారింది.

పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరిన ఇరిగెల సోదరులు

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్

## ప్రజాసంకల్ప యాత్రకు ఆరేళ్లు

- డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్

**ప్రజాశక్తి- డోన్**

వైసిపి అధినేత వైఎస్. జగన్మోహన్ రెడ్డి తలపెట్టిన 'ప్రజాసంకల్ప యాత్ర' ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ నాయకత్వంలో సంబరాలు జరుగుపుకున్నారు. ఈ సందర్భంగా కేట్ కట్ చేశారు. ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పోరేషన్ ఛైర్మన్ ఎం.శ్రీరాములు, కోఆప్షన్ సభ్యులు వైఎస్ఆర్ రఫీ, 13వ వార్డు కౌన్సిపల్ టిఇ.దినేష్‌గౌడ్, కౌన్సిలర్లు ఆర్ట్ రమణ, దారా హరినాథ్‌రెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు సట్టి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా పథకాలు : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సోమవారం కొలిమిగుండ్ల మండలంలోని తుమ్మలపెంట గ్రామ సచివాలయం పరిధిలో రెండవ రోజు అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలోని ఈసీసీ,లేబర్ కాలనీలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ప్రసాద్ రెడ్డి, తహసిల్దార్ ఆల్ఫ్రెడ్, మండల వైసిపి కన్వీనర్ అంబటి గురివిరెడ్డి, తుమ్మలపెంట గ్రామ వైసిపి నాయకులు తోట మల్లేశ్వర్ రెడ్డి, బాల దస్తగిరిరెడ్డి,సారెడ్డి లక్ష్మిరెడ్డి, సర్పంచు మల్లేశ్వరి, ఉపసర్పంచ్ శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేసిన టిడిపి నాయకులు

## తాగునీటి సమస్య తీర్చిన ధర్మవరం సుబ్బారెడ్డి

**ప్రజాశక్తి - ప్యాపిలి**

మండలంలోని కలచట్ల గ్రామంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని ప్రజలు అడగడంతో టిడిపి ఇన్చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి వెంటనే నీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం టిడిపి కరువు బృందం మండలంలో పర్యటించినప్పుడు సమస్యను టిడిపి రాష్ట్ర నాయకులు దృష్టికి ప్రజలు తెలపడంతో పక్కన ఉన్న ధర్మారం సుబ్బా రెడ్డి వెంటనే నీటి ట్యాంకర్‌ను వారి సొంత నిధులతో ఏర్పా టు చేశారు. తాగునీటినీ సమస్య తీర్చిన సుబ్బారెడ్డికి కలచట్ల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రసాద్, రామాం జనేయులు, రామచంద్రుడు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

# స్మశాన వాటిక ఏర్పాటు చేయండి

- గడప గడప మన ప్రభుత్వంలో వనములపాడు గ్రామస్తులు వినతి

**ప్రజాశక్తి - పగిడ్యాల**

మా గ్రామంలో స్మశాన వాటిక లేదు మనుషులు చనిపోతే ఎక్కడ దహన సంస్కారాలు కేసికినాల గట్లపై చేస్తున్నామని స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని వనములపాడు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ముందు వాపోయారు. సోమవారం మండలంలోని పాత ముచ్చుమర్రి గ్రామపంచాయతీ మజరా గ్రామమైన వనములపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వనము లపాడు గ్రామానికి స్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని మనిషి చనిపోతే కేసి కెనాల్ కట్టు వెంట పొలాల గట్లు వెంట దాన సంస్కారాలు చేస్తున్నామని స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు ఎమ్మెల్యే ఆర్థర్ ముందు మొరపెట్టుకున్నారు. మీ గ్రామానికి తప్పకుండా స్మశాన వాటిక ఏర్పాటు చర్యలు చేపడతామని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గ్రామంలోని తదితర సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా తక్షణమే పరిష్కరించాలని య ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి భోజనంను తిని పలు సూచనలు చేశారు. ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించి విద్యార్థుల చేత జాతీయ గీతంను పాడించారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్థర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్డి గారి రమాదేవి, జడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, ఎంపీడీవో వెంకటరమణ, తహశీల్దార్ భారతి, ఎంఈఓ సుభాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవిస్తున్న గ్రామ ప్రజలు

# జీతాలు వెంటనే చెల్లించాలి : ఎపిటిఎఫ్

**ప్రజాశక్తి - బనగానపల్లె**

ఉద్యోగ, ఉపాధ్యాయులకు నవంబర్ ఆరో తేదీ దాటిన ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడం విచారకరమని వెంటనే జీతాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.మాధవ స్వామి జిల్లా సహాధ్యక్షులు ఎం. మధుసూదన్ రావు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఏపీటీఎఫ్ డివిజన్ కార్యాలయం ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు జీతాలు రాకపోవడం వల్ల అనేక నిత్యవసరాలు తీర్చకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులలో ఈఎంఐలకు వడ్డీల మీద వడ్డీలు కట్టలేక ఉపాధ్యాయ, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు జీతాలు మహాప్రభు జీతాలు అంటూ ఇబ్బందులు పడుతున్నారని వెంటనే జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఏ ఒక్క నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలలను కలపడం వల్ల ఒకటి రెండు తరగతుల గల పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడే స్థాయికి ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించడం వల్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడి సింగిల్ టీచర్ , అసలు ఉపాధ్యాయులు లేని పాఠశాలలుగా మిగిలిపోయాయని వెంటనే ఉపాధ్యాయ నియమకాలు చేపట్టి భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రామకృష్ణ, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్స్ వి.సుబ్బరాయుడు, పి. సుబ్బ రాయుడు, జె. రామకృష్ణ, బనగానపల్లె మండల అధ్యక్షులు జె. వెంకట కృష్ణుడు,కె.రమేష్, కుమార్ బాబు,కె. గోవింద నాయక్, ఎస్.పోలియో నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి

# పారిశుధ్య కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి: సిఐటియు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు మున్సిపాలిటీలో 2015 సంవత్సరం నుండి నేటి వరకు పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు అరకొర వేతనాలు ఇచ్చి చేతులు దులుపుకోవడం సరైనది కాదని వారందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో డిఆర్‌ఓ పుల్లయ్యకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్య క్రమంలో పారిశుధ్య కార్మిక యూనియన్ నాయకులు రాజు, శేషఫణి శర్మ వీరుతోపాటు 20 మంది కార్మికులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లా డుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి దాదాపు నాలుగున్నర సంవత్సరాలు పూర్తయిన నేటి వరకు రెగ్యులర్ చేయడం లేదని, రెగ్యులర్ చేయకుండా ఆప్కాసుని ప్రవేశపెట్టి వాటిలో కొంతమంది కార్మికులను నేటి వరకు గుర్తించకపోవడం, అనుసంధానం చెయ్యకపోవడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా కార్మికుల శ్రమను గుర్తించి వారందరినీ ఆప్కాస్‌లో చేర్చి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ఇదే విషయాన్ని డిఆర్‌ఓ పుల్లయ్య నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా కౌన్సిల్లో ఆమోదం తెలపాల్సి ఉందని వెంటనే కౌన్సిల్లో ప్రవేశపెట్టి ఆమోదం తెలిపేలా కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

## చెంచు గూడేలలో సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్**

దోర్నాల మండలం చెంచు గిరిజన గూడెంలో ఉంటున్న నివాసితుల సమస్యలను పరిష్కరించాలని కొమరం భీమ్ చెంచు గిరిజనసంక్షేమ సంఘం నాయకులు కోరారు. గత రెండు రోజులుగా ఎండ లేక పోవడంతో సోలార్ విద్యుత్తు రాక పోవటంతో బోరు పనిచేయడం లేదని మంచి నీళ్లకు ఇబ్బందికరంగా ఉందని చెంచు గుండెలలోని సమస్య లను పరిష్క రించాలని సుండిపెంటలోని ఐటిడిఎ కార్యాలయం నందు ఎపిఒ ఎ. సురేష్ కుమార్‌కు సోమవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆశీర్వాదము మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొల్లమయ్య,వెంకటేశ్వర్లు,వై. శీను,పి.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలపై వైసిపి కపట ప్రేమ : భూమా

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై వైకాపా కపట ప్రేమ చూపిస్తూ బస్సు యాత్రల పేరిట వారిని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ బస్సు యాత్ర ముఖ్యమంత్రి తిరుగుతారని మొదట చెప్పారని, ఇప్పుడు బస్సు యాత్ర మంత్రులతో ఎందుకు చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులపై ఏవిధంగా దాడులు, మైనార్టీలకు అన్యాయం చేయడంలో వైకాపా ప్రభుత్వం ముందుందన్నారు. ముస్లిం మైనారిటీ పథకాలను తొలగించారన్నారు. రైతుల సమస్యలపై తాను స్పందిస్తే తనపై జల వనరుల శాఖ ప్రభుత్వ సలహాదారులు గంగుల ప్రభాకర్ రెడ్డి తనపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు కెసి కాలువ వెంట తిరిగి రైతులకు నీళు అందించామని, ఇప్పుడు మీరు ఎందుకు చేయలేకపోతున్నా రని అఖిలప్రియ అన్నారు. పార్టీని పక్కనపెట్టి స్వతంత్రంగా పోటీ చేయడానికి తాను సిద్ధమని, మీరు పోటీ చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాగాంజనేయులు, భాస్కర్, జానా సత్యం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

అవార్డు తీసుకుంటున్న మదర్ సొసైటీ ఫౌండర్ రామారావు

## మదర్ సొసైటీ సేవా సంస్థకు బెస్ట్ ఎన్‌జిఒ అవార్డ్

**ప్రజాశక్తి- నంద్యాల రూరల్**

మదర్ సొసైటీ సంస్థకు బెస్ట్ ఎన్జీవో అవార్డు రావడం సంతోషంగా ఉందని మదర్ సొసైటీ ఫౌండర్,సీఈవో మేడెద రామారావు పేర్కొన్నారు. సోమవారం మూవ్ మెంట్ ఇండియా ముంబాయి, గ్రామ జ్యోతి సొసైటీ వారి ఆదేశాల మేరకు మదర్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ నంద్యాల వారి ఆధ్వర్యంలో జూలై నుండి అక్టోబర్ 14 తేదీ వరకు వాక్ ఫర్ ద ఫ్రీడమ్ కార్యక్రమంలో భాగంగా మానవ అక్రమ రవాణా మీద అవగాహన సదస్సులు మదర్ సొసైటీ నిర్వహించినందుకు గాను శనివారం మదర్ సొసైటీ సేవా సంస్థకు బెస్ట్ ఎన్జీఓ అవార్డ్‌ను మదర్ సొసైటీ సేవా సంస్థ ఫౌండర్ మేడెద రామారావుకు అన్నమయ్య జిల్లా అడిషనల్ జడ్జి బందెల అబ్రహం చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జడ్జి అబ్రహం మాట్లాడుతూ జూలై నుండి అక్టోబర్ వరకు మానవ అక్రమ రవాణా అరికట్టాలని దేశ వ్యాప్తంగా 500 ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించా రని, మూడు లక్షలు మంది పాల్గొన్నారని, మానవ అక్రమ రవాణాకు ప్రతి ఒక్కరూ వ్యతిరేకంగా పోరాడాలని ఆయన తెలిపారు. దక్షిణ భారత దేశం కు సంబంధించి వాక్ ఫర్ ఫ్రీడమ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమం మీటింగ్ ఈరోజు మదనపల్లిలో జరిగిందని, 30 మంది ఎన్నిక చేసిన ఎన్జీఓ లు పాల్గొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూవ్ మెంట్ ఇండియా ప్రతినిధులు ముంబై ఢిల్లీకి , చెందిన నిస్సీ, ,ఫెలిసియ, గ్రామ జ్యోతి సొసైటీ సుభద్ర, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాటుసార అమ్మితే కఠిన చర్యలు : ఎస్ఐ

**ప్రజాశక్తి - మిడుతూరు**

నాటు సారా అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జగన్మోహన్ హెచ్చరించారు. సోమవారం మిడుతూరు మండలంలోని చింతలపల్లి గ్రామం వద్ద పసుపుల గ్రామానికి చెందిన కుమార్ నందికొట్కూర్ నీలి షికారి పేటకు చెందిన పరుశు రాం వీరిద్దరూ ఒక్కరు దగ్గర 10 లీటర్ల సారాయి అమ్ముతుండగా వారిని పట్టుకుని బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు. మండలంలో ఏ గ్రామంలో అయినా నాటసార అమ్మినట్లయితే గ్రామస్తులు సమాచార ఇవ్వాలని ఆయన తెలిపారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పిటిసి పుల్యాల దివ్య

## వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

**ప్రజాశక్తి - పగిడ్యాల**

మండల కేంద్రం పగిడ్యాలలో గుండెపోటుతో మృతి చెందిన కాటే పోగు శేఖర్ కుటుంబానికి వైయస్సార్ బీమా పథకం కింద తక్షణ ఆర్థిక సహాయంను జడ్పిటిసి పుల్యాల దివ్య అందజేశారు. ఈ సందర్భంగా మతుడు భార్య కాటే పోగు లక్ష్మీదేవికి జడ్పిటిసి రూ.10 వేలు అందజేశారు. జెడ్పిటిసి పుల్యాల దివ్య మాట్లాడుతూ ఒక నెల లోపు రూ. 90 వేలు నామిని బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. వైయస్సార్ బీమా పేదలకు వరం అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానానికి వాహనం విరాళం

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైల దేవస్థానానికి సోమవారం నాడు తిరుపతి నివాసులైన ఉదయ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి ఎంజి ఆస్ట్రార్ వాహనాన్ని దేవస్థానానికి విరాళంగా అందజేశారు. క్షేత్రంలోని గంగాధర మండపం వద్ద దాతలు ఈ వాహనాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు కు వాహనాన్ని అందజేశారు. ఈ వాహనం విలువ 15 లక్షల రూపాయలు అని దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శివప్రసాద్ స్వామి, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారి మోహన్ తదితరులు ఉన్నారు. వాహనాన్ని సంప్రదాయపద్ధంగా ఆలయ అధికారులకు అందజేసిన దాతలకు శేష వస్త్రాలను ప్రసాదాలను అందజేశారు.

## వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

**ప్రజాశక్తి - బనగానపల్లె**

పట్టణంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఫ్రెండ్ బ్లడ్ గ్రూప్ ఆధ్వర్యంలో అగ్నిమాపక శాఖ అధికారి నరసింహులు దుప్పట్లను పంపిణీ చేశారు. సోమవారం పట్టణంలోని వృద్ధాశ్రమంలో ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు ఆకర్షితుడై షాషావలికి చిన్ననాటి స్నేహితుడైన రంగనాయకులు అనే యువకుడు బెంగుళురు నుంచి బనగానపల్లె వరకు వచ్చి ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వయో వృద్ధులకు చలికాలం దృష్టిలో ఉంచుకొని దుప్పట్లు,వాటర్ బాటిల్,అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి నరసింహులు మాట్లాడుతూ ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రంగనాయకులు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేయడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్ బ్లడ్ గ్రూపు ప్రతినిధి షాషావలి, రాణి, బాలకృష్ణ, శ్రీకాంత్, బాలరాజు, వృద్ధాశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్లను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక అధికారి